క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రామన్నపేట : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు వరంగల్ జిల్లా కోర్టు జడ్జి అబ్బోజు వెంకటేశం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. దుగ్గొండి మండలం వెంకటాపూర్‌కు చెందిన బొమ్మగాని రాజేశ్‌కు రెండు రోజులు, వరంగల్ పెరికవాడకు చెందిన చింతనూరి శ్రీనివాస్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు. వీరిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు వివరించారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 16 మందికి రూ.19,700 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి రూ2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

మే 1 నుంచి వేసవి కరాటే శిబిరం

కాజీపేట రూరల్ : కాజీపేటలో వేసవి సెలవులను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు స్పోర్ట్స్ కాయ్ షోటో ఖాన్ కరాటే అకాడమీ ఇండియా వారు మే 1 నుంచి 25వ తేదీ వరకు ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అకాడమి ఫౌండర్ నాయిని సదానందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోచ్‌గా సి.హెచ్.దీపక్ సాయి బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్‌గా వ్యవహరించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లు ఏప్రిల్ 30 వరకు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8106460678, 984963922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ముళ్లపొదల తొలగింపు

హసన్‌పర్తి : హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ చైర్మన్ జె.రవి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తలు సురేష్, సంతోష్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.


ప్రశాంత్‌నగర్‌లో కుక్కల స్వైర విహారం

కాజీపేట : కాజీపేట 51వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారులపై విరుచుకు పడుతుండటంతో గాయాల పాలవుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిని జనావాసాలకు దూరంగా తరలించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన గోక్షీరాభిషేకం పూజలు

కాజీపేట : స్థానిక శ్వేతార్కమూలగణపతి దేవాలయంలో మంగళవారం స్వామి వారికి 108 లీటర్ల గోవు పాలతో క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన గోవు పాలతో పండితులు అభిషేకం జరిపించారు. బుధవారం నుంచి వసంతోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం చేసి ఆలయ పరిసర ప్రాంతాలను సంప్రోక్షణ చేశారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణశర్మ, హరిస్వామి, దయాకరశర్మ, మణిదీప్, రవి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకుడు ప్రేమ్‌కుమార్ గద్దలకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. మల్టికల్చరలిజమ్ ఇన్ నేయిల్ బిసూందత్స్ ఫిక్షన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ఆచార్యులు డాక్టర్ ఎం.ప్రభాకర్ పర్యవేక్షణలో ప్రేమ్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : టీజీ ఎస్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డివిజన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అమ్మవారిపేట, భట్టుపల్లి, కొత్తపల్లి, సైనిక్‌పురి, కడిపికొండ, బోడగుట్ట, అయోధ్యపురం, రాజీవ్ గృహకల్ప, సూర్యకుటీర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ప్రమాదకరంగా నల్లా సంపు పైపు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డుపై ఉన్న సంపు పైపు

కాజీపేట రూరల్ : బాపూజీనగర్‌లో నల్లా సంపు పైపు ప్రమాదకరంగా ఉందని స్థానిక ప్రజలు అంటున్నారు. బాపూజీనగర్ మెయిన్ రోడ్ నుంచి బూడిదిగడ్డకు వెళ్లే మార్గం మధ్యలో నల్లా సంపు పైపు భూమి లోపలికి రంధ్రం లాగా ఉండడంతో ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. స్కూల్‌కు వెళ్లే పిల్లలు, పని నిమిత్తం అవసరాల కోసం వెళ్లే వారు రంధ్రంలాగా పైకి కనిపిస్తున్న సంపులో కాలు పడే ప్రమాదం ఉందన్నారు. రాత్రి వేళలో ఎవరైనా కొత్తవారు ఈ రోడ్డు గుండా వెళ్లి వచ్చే వారికి ఈ సంపు రంధ్రం కనబడకుండా ఉండడంతో ఇబ్బందికరంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రేటర్ మున్సిపల్ అధికారులు పట్టించుకొని సంపు రంధ్రంను పక్కకు లేదా పైకి కనిపించకుండా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్చురీలో నూతన ఫ్రీజర్లు ఏర్పాటు చేయాలి



సూపరింటెండెంట్ డాక్టర్ సాయికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంజీఎం : ఎంజీఎం మార్చురీలో ఫ్రీజ్ బాక్స్‌లు పని చేయకపోవడంతో పార్థివదేహాలు త్వరగా డీ కంపోజ్ అవుతున్నాయని వెంటనే నూతన ఫ్రీజర్ బాక్స్‌లను లేదా ఉన్న బాక్స్‌లను మరమ్మతు చేయించాలని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ సాయికుమార్, ఆర్ఎంఓలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ పార్థివదేహాలను వైద్య విద్య నిమిత్తం మెడికల్ కాలేజీలకు అప్పగిస్తుంటే నాణ్యత కోల్పోవడంతో అవి మెడికల్ చదువులకు, శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడటం లేదన్నారు. నేత్రాల సేకరణ సమయంలో కూడా కార్నియాలో కంటి పొరలు నాణ్యత లోపించడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఉపయోగపడటం లేదని తెలిపారు. మార్చురీలో కొత్త స్ట్రెచర్స్, చేతుల పరిశుభ్రతకు సింక్‌ల్లో నీటి సౌకర్యం, లోపల, బయట సరిపడా లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నిల్వ ఉంచిన దేహాలను జీడబ్ల్యూఎంసీ సిబ్బంది వెంటనే తీసుకుపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో వయో వృద్ధులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజేంద్రప్రసాద్, హనుమకొండ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యుగేందర్, తదితరులు ఉన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్ : భార్యభర్తల మధ్య తలెత్తిన గొడవలతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ మధ్య జాన్ పీరీల వద్ద చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబల్ జి.సుదర్శన్ కథనం ప్రకారం.. గీసుగొండ మండలం గొర్రెకుంటకు చెందిన కొల్లూరి సతీష్ (32) తరుచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది జాన్ పీరీల వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య చైతన్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి కొల్లూరి బాబు ఫిర్యాదు మేరకు శవపరీక్షలు అనంతరం మృతదేహాన్ని బాబుకు అప్పగించినట్లు తెలిపారు.

అంబేడ్కర్ కాలనీలో బోరు ఏర్పాటు

మడికొండ : వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో ప్రజల కోరిక మేరకు బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 64వ డివిజన్ మడికొండ అంబేడ్కర్ కాలనీలో మంగళవారం బోరు వేశారు. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దువ్వ శ్రీకాంత్, ఉబ్బని వెంకటయ్య, కొప్పుల నవీన్‌యాదవ్, దాసరి విరేష్, వినయ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

- సీఎం, ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత



సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కమిటీ బాధ్యులు

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కేయూలోని పరిపాలనా భవనం వద్ద కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె మంగళవారంతో 11వ రోజుకు చేరింది. ఈ శిబిరంలో కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు శ్రీధర్ కుమార్‌లోథ్, ఆశీర్వాదం, ఏటీబీటీ ప్రసాద్, గద్దం కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. శిబిరంలో జేఏసీ బాధ్యులు కనకయ్య, సతీష్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, ప్రసాద్, వీణ, కవిత, ,రాజు, రఘువర్ధన్‌రెడ్డి, సునీత, భాగ్య శ్రీలత, శ్రీదేవి సత్యనారాయణ పాల్గొన్నారు. తొలుత వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు.

సీఎంకు వినతిపత్రం అందజేత

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కో ఆర్డినేషన్ బాధ్యులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించి వినతిపత్రం సమర్పించారు. కమిటీ బాధ్యులు డాక్టర్ సాధు రాజేష్, డాక్టర్ జూలసత్య, డాక్టర్ నాగయ్య తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు తగిన న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు ప్రొఫెసర్ల సమస్యలు తన దృష్టికి వచ్చాయని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కోఆర్డినేషన్ జేఏసీ బాధ్యులు మంగళవారం తెలిపారు.

ఆరోగ్యశ్రీ పథకం పరిమితి పెంపు

- ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్‌పర్తి : ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచినట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 65వ, 66వ డివిజన్లకు చెందిన దరఖాస్తుదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెలే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు వివరించారు. కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి–సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కసపర్తి కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, చంటిరెడ్డి, జె.రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌రావుకు ఘన నివాళి



విద్యాసాగర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొన్నాల, వినయ్‌భాస్కర్

హన్మకొండ : తెలంగాణ తాగునీటి తండ్లాట తీర్చేందుకు ఆర్.విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో విద్యాసాగర్ రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యాసాగర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాసాగర్‌రావు కేంద్ర జల కమిషన్‌లోని జలవనరుల మంత్రిత్వ శాఖకు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి నీటి కేటాయింపులో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపడంలో కీలకపాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి ఆయన చేసిన అపారమైన కృషికి డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి విద్యాసాగర్‌రావు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అని పేరు పెట్టారన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్గొండ జిల్లాకు సురక్షితమైన తాగునీటి కోసం, తెలంగాణ ప్రాంతంలోని శుష్క భూములకు నీటిని అందించాలని ఆయన పోరాడారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ చెన్నం మధు, నాయకులు అనిల్, నయీముద్దీన్, వెంకన్న, వినీల్ రావు, రమేష్, రాకేష్ యాదవ్, శ్రీకాంత్ చారి, రఘు, సంపత్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి



జగన్మోహన్‌రెడ్డి వర్ధంతి సభలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, ఇతర బాధ్యులు

విద్యారణ్యపురి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తగా సామ జగన్మోహన్‌రెడ్డి జాతీయభావంతో ముందుకెళ్లారని ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి కోరారు. మంగళవారం జగన్మోహన్‌రెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా ఏబీవీపీ, జగన్మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు.సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జగన్మోహన్ స్ఫూర్తితో ఏబీవీపీ కార్యకర్తలు ముందుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, వరంగల్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ ఏలేటి నాగరాజు, వైద్యులు డాక్టర్ విశ్వభారతిరెడ్డి, డాక్టర్ కృతిక, సంధ్యారాణి, మానసరెడ్డి, డాక్టర్ మంజుల, వరంగల్ విభాగ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సుజిత్, ఎస్ఎఫ్‌డీ కోకన్వీనర్ రోహిత్, సిటీ సెక్రటరీ అరుణ్, జోనల్ ఇంచార్జి హరిచరణ్ పాల్గొన్నారు. తొలుత జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

జాతీయతే ఊపిరిగా విద్యార్థి ఉద్యమాలు

కేయూ క్యాంపస్: జాతీయతే ఊపిరిగా నాడు విద్యార్థి ఉద్యమాలను సామ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించారని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానారెడ్డి అన్నారు. నాడు నక్సలైట్ల చేతిలో సామ జగన్మోహన్ రెడ్డి హత్యకు గురయ్యారని ఆ రోజును బలిదాన్‌దివస్‌గా ఏబీవీపీ జరుపుతుందని ఆయన తెలిపారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కేయూలో గణితవిభాగం సెమినార్‌హాల్‌లో జగన్మోహన్‌రెడ్డి 40 వర్ధంతిని నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ నాడు జాతీయ జెండా గౌరవం కోసం నిలబడటం, విదేశీ భావజాలంను కూడా జగన్మోహన్‌రెడ్డి వ్యతిరేకించారన్నారు. కేయూ అర్థశాస్త్రం విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారని గుర్తుచేశారు. కేయూ ఏబీ వీపీ ఇన్‌చార్జ్ నిమ్మల రా జేష్, ఏబీవీపీ విభాగ్ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, కేయూ కార్యదర్శి చింతకాయల శివప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌ను రద్దు చేయండి

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాజేందర్

హసన్‌పర్తి : ఉపాధి హామీ కూలీల హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను (ఎన్ఎంఎంఎస్) రద్దు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని జయగిరిలో ఉపాధి కూలీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఇచ్చిన పనిముట్లు తుప్పు పట్టాయని చెప్పారు. కొత్త కూలీలకు జాబ్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీయూడబ్ల్యూజే నేతలు



ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సుగుట్ట నానిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన భూ భారత చట్టం అవగాహన సదస్సుకు హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రికి వారు డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలాలు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రాంచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు కూర్న వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు

పరశురాముని స్ఫూర్తితో అన్యాయాలను ఎదుర్కోవాలి

- బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ



మాట్లాడుతున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : దశావతారాల్లో ఒక్కరైన పరశురాముని స్ఫూర్తితో సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న అన్యాయాలను సంఘటితంగా ఎదుర్కోవాలని బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో పరశురాము జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పరశురామ జయంతిని బ్రాహ్మణులకు దళితులకు మధ్య సాంస్కృతిక వారధిగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, ప్రధాన కార్యదర్శి గంగు నవీన్, పరశురాం దళ్ నాయకులు గంగు మణికంఠశర్మ, వెంకటరమణాచార్యులు, మేఘశ్యామ్, శ్రీమన్నారాయణాచార్యులు, నితిన్, తోట పవన్, శ్రీను బన్నీ, శశి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామికి బంతిపూల అలంకరణ



అన్నదానంలో పాల్గొన్న ఆంజనేయ స్వాములు

హన్మకొండ అర్బన్ : పద్మాక్షి కాలనీలోని హనుమత్‌గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ఉదయం పంచామృత అభిషేకం, చందన సేవ, బంతిపూల అలంకరణ చేసినట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. అనంతరం స్వామి వారికి హారతి ఇచ్చినట్లు వివరించారు. అర్చకులు ఆరుట్ల రామాచారి ఆధ్వర్యంలో అర్ధమండల (21 రోజుల) మాలధారణను 300 మంది ధరించినట్లు తెలిపారు. 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ కూడా మాలధారణ చేసినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆంజనేయస్వామి మాలదీక్ష స్వాములకు భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష సేవా సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్‌కుమార్, మొగులయ్య, సుధాకర్, సత్యం, సీతా సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.

కేడీసీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

విద్యారణ్యపురి : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ నేడు (బుధవారం) ఉద్యోగ విరమణ పొందుతున్న డాక్టర్ జి.రాజారెడ్డిని మంగళవారం ఆ కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. సెమినార్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి పాల్గొని రాజారెడ్డి అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు కలిసి రాజారెడ్డి దంపతులను శాలువా కప్పి పూలబోకేను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం బాధ్యులు జె చిన్న, బోధన, బోధనేతర సిబ్బంది, పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీ రగడ

- కనిపించని ఎమ్మెల్సీ పోచంపల్లి ఫొటో



భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సుగుట్ట నాని గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఫ్లెక్సీ రగడ ఉవ్వెత్తున ఎగిసిపడింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటోను ఫ్లెక్సీలో లేకపోవడంతో పలువురు ఆవేదన వెలిబుచ్చారు. ఫ్లెక్సీలో మండలి డిప్యూటీ చైర్మన్ బండాప్రకాశ్, ఎమ్మెల్సీలు సారయ్య, తీన్మార్ మల్లన్న ఫొటోలు పెట్టి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటో పెట్టకపోవడం పెద్ద దుమారం లేపింది. అంతేకాదు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి ఫొటోలు ఫ్లెక్సీలో పెట్టినప్పుడు వరంగల్ జిల్లా ప్రామాణికంగా తీసుకుంటే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫొటో పెట్టకపోవడంతో కాంగ్రెస్‌లో మరోసారి నేతల మధ్య విబేధాలు బయటపడ్డాయి. ఫ్లెక్సీని చూసిన పార్టీ శ్రేణులు అధికార వర్గాలను ప్రశ్నించారు.

జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి

నయీంనగర్: కుల నిర్మూలన అనే ఆశయాల కోసం తమ జీవితాలను అంకితం చేసిన బహుజన మహనీయుల జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని జయంతి కమిటీ నాయకులు జిల్లపెల్లి సుధాకర్, జి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు (బుధవారం) సాయంత్రం 5 గంటలకు సమ్మయ్యనగర్ హనుమకొండలో నిర్వహించనున్న జయంతి ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దామోదర్, నర్సింహ, స్వామి, వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

హన్మకొండ : సమ్మయ్యనగర్‌లోని ఇంజనీరింగ్ కాలనీలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సమ్మయ్యనగర్‌లో ఈ మేరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కేయూ ప్రొఫెసర్ శ్రీనివాస్ సీపీఎం జిల్లా కమిటీ నాయకులు ఎం.చుక్కయ్య, జి.వెంకట్ దీక్షలకు సంఘీబావం తెలిపారు. దీక్షలో సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ కార్యదర్శి వీరన్న, వెంకన్న, రవీందర్, ప్రసాద్, వి.రాజు, అరుణ పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా



కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకులు క్యాంపస్‌లోని పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం భవనం ప్రాంగణంలోనే భోజనం చేస్తూ తమ నిరసన తెలిపారు. పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు , బాధ్యులు డాక్టర్ నరేందర్ నాయక్, రాజేందర్, శ్రీకాంత్, మోహన్, శ్రీధర్,రామ్మోహన్, శ్రీనివాస్, హరికుమార్, మాధవి, విజయ, సంధ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులకు పే స్కేలు అమలు చేయాలి



అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగుల జేఏసీ నాయకులు

హన్మకొండ : తమకు పే స్కేల్ అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగులు కోరారు. మంగళవారం హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీనును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏడాది కాలంగా ఆలస్యంగా మూడు నాలుగు నెలలకు వేతనాలు వస్తున్నాయని తెలిపారు. జీతాలు రాక చాలా మంది ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారన్నారు. జీతాలు ప్రతినెలా ఇవ్వకపోతే ఉద్యోగం చేయలేమని, అవసరమైతే సమ్మెకు వెళ్తామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఎస్ఆర్‌డీఎస్ ఉద్యోగ జేఏసీ నాయకులు నక్క కుమారస్వామి, నలమాసుల రమేష్, కార్తీక్, వెంకటరామిరెడ్డి, రఘు, మధన్‌సింగ్, వెంకన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం కల్పించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సంవత్సరం ఆధారంగా డిగ్రీ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు కలిగిన విద్యార్థులకు మరోసారి సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి కోరారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. డీవైఎఫ్ఐ బాధ్యులు బి.ప్రవర్తన, విజయ్‌వర్మ ఉన్నారు.